
# పూర్తికాని డైరీ




## రషీదా బేగం

''కవిత?!...''

''...అనిత...''అంతకన్నా మాట్లాడలేకపోతుంది. ఆమె నోటంట నురుగు కారుతుంది. తన దిండుకిందనున్న డైరీ తీసి అనిత చేతుల్లో పెట్టగలిగిందంతే! కన్ను మూసింది కవిత.

''అమ్మా కవిత వెళ్లిపోయావా తల్లీ'' అంటూ ఏడుస్తున్నారు ఆమె తల్లీ, అక్కా: తండ్రి నిశ్శబ్దంగా కన్నీరు కారుస్తున్నాడు. కన్నీరు కారుస్తూ చుట్టూ చూసిందిఅనిత. గుమ్మాని కానుకుని పైకి కనిపించనీయకుండా తనలో తానే బాధను దిగమింగుకుంటున్నాడు కవిత బావ.

''అయ్యయ్యో! ఎంతపని జరిగింది? ఇప్పుడేనమ్మా నవ్వుతూ మాట్లాడింది. నాతో ఈరోజు మీ పుట్టినరోజని, మీదగ్గరికెళ్ళాలని గడపదాటింది. ఎక్కడున్నదో ఏమో ప్రాణం తీసుకుంది'' అనితతో చెప్పుకుపోతుంది పొరుగింటామె.

''నాకోసం గడప దాటకున్నా బాగుండేదే కవితా!'' అంటూ ఏడ్చింది.

''అనితా!'' పిలుస్తూ బైటగుమ్మంలో నిల్చున్నాడు రమేష్.

''అన్నయ్యా! కవిత మనకిక లేదన్నయ్యా!'' అంటూ ఏడుస్తూ అతని భుజంపై తల ఆన్చుకుంది.

ఆ వార్త వింటూనే కొయ్యబారిపోయాడు రమేష్.

''ఎట్లా జరిగిందీ అన్యాయం'' అని మాత్రం అనగలిగాడు.

''పాము కరిచిందీ...''

తల నిమురుతూ, అనితను ఓదార్చి ఆమెని వదిలి లోపలికొచ్చి కవిత శవాన్ని చూశాడు. శాశ్వతంగా నిద్రపోతున్న కవిత మొహాన్ని చూడగానే అతనికీదుఃఖం పెల్లుబికింది. ఆ రోజు సాయంత్రం కవిత దహన క్రియలు జరిగాయి.

''అనితా... ఇంటికి పద'' అంటూ కారెక్కించిన అన్నయ్యను యాంత్రికంగా అనుసరించింది. మనసంతా కవిత చుట్టూ తిరిగింది. కవితతో పరిచయం విచిత్రంగానే జరిగింది. కవిత తన బాల్య స్నేహితురాలు కాకపోయినా తామిద్దరి మధ్య ఎందుకో అనురాగం పెనవేసుకు పోయింది.

అనిత డాక్టర్‌గా ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తుంది. ఓ రోజు వో అమ్మాయి జ్వరంగా ఉందంటూ తన దగ్గరికొచ్చింది. ఆ అమ్మాయి కచ్‌వర్క్ చేసి ఉన్న చీర కట్టుకున్నది. అనితకు కూడా చాలా కుట్లు వచ్చు కానీ వర్క్ మాత్రం రాదు. దాని ద్వారానే ఆ అమ్మాయి పరిచయమైంది.

ఆ రోజు ఆసక్తిగా ''ఏం పేరు ?'' పరీక్ష చేస్తూ అడిగింది డా. అనిత.

''కవిత'' చెప్పిందామ్మాయి.

''ఎప్పట్నుంచి వస్తుందీ జ్వరం ?''

''అయిదారు రోజుల నుంచి ఉందండి.''

''ఈ టాబ్లెట్స్ వాడండి'' అంటూ మాత్రలకి చీటీ వ్రాసిచ్చింది.

అది అందుకుని వెళ్లిపోయింది కవిత.

వారం రోజుల పిదప అనిత యిల్లు వెతుక్కుంటూ వెళ్ళింది కవిత.

అప్పటికి స్నానం చేస్తూంది తను.

ఆనాటి దృశ్యం అనితకింకా జ్ఞాపకం వుంది. తను హాల్లోకొచ్చేసరికి అన్నయ్య ఏదో పలకరిస్తున్నాడు. తనను చూస్తూనే ''నమస్తేనండీ'' కూర్చున్న చోటునుండే లేచి అన్నది.

"జ్వరం తగ్గిందా? ఎలావుందిప్పుడు?" నవ్వుతూ అడిగింది

అన్నయ్య బైటికెళ్ళిపోయాడు.

"తగ్గిందండి ఆ విషయమే చెప్పాలని వచ్చాను"

"ఏమండీ మీకు కచ్‌వర్క్ వచ్చా!" తాను మరో కుర్చీలో కూర్చుంటూ అడిగింది

"వచ్చండీ దేనికండీ?"

"నాకు నేర్చుకోవాలనుందండీ. కానీ నేర్పేవారెవరూ లేరు"

"మీ కెప్పుడు వీలవుతుందో చెప్పండి. వచ్చి నేర్పిస్తాను."

వెంటనే ఉత్సాహంగా అంది కవిత.

"చాలా థ్యాంక్స్. అడక్కుండానే అంగీకరించారు. ఆదివారం మధ్యాహ్నం మీకు తీరికైతే రండి."

"అలాగేనండి. తప్పకుండా వస్తాను. వెళ్తాస్తానండి" అంటూ లేచింది.

"ఉండండి. కాఫీ తీసుకొందురుగాని.."

"ఫర్వాలేదండి. తీసుకునే వచ్చాను."

"మళ్ళీ నాతో తీసుకుందురు. కూర్చోండి" అని కూర్చోబెట్టింది తను.

"ఏం చదువుతున్నారు?"

"బి. ఎస్సి. చదివి గర్ల్స్‌హైస్కూల్లో టీచరుగా పనిచేస్తున్నానండి."

"మీ నాన్నగారేం చేస్తారు? ఎంతమంది మీరు?"

"బ్యాంక్‌లో క్లర్కండి. మేంనలుగురం ఆడపిల్లలం. నేను రెండోదాన్ని. మీ రెంతమంది?"

"నేనూ, మా అన్నయ్యే. అన్నయ్య ఇంజనీర్. ఇక్కడే ఏడాది నుండి ఉంటున్నాడు. నాకు నాల్గెళ్ళ క్రితమే ఇక్కడ ఉద్యోగం దొరికింది. ఇక్కడికి కొచ్చేశాం. మా నాన్నగారు రిటైర్డ్ హెడ్ మాస్టరు"

ఇంతలో పని మనిషి కాఫీ, టిఫిన్ తెచ్చింది. కాఫీ తీసుకున్న పిదప వెళ్ళిపోయింది కవిత.

ఆ విధంగా కవితతో పరిచయమేర్పడింది. ఆ పరిచయమే స్నేహంగా మారి వీడని బంధ మయి పోయింది.

కారు ఆగటంతో ఆలోచనా లోకం నుండి ఉలిక్కిపడింది అనిత. ఇప్పుడు గుర్తు కొచ్చింది తను కార్లో ఉన్నానన్న సంగతి.

"దిగు" అంటూ దిగాడు రమేష్. మౌనంగా అతన్ని అనుసరిస్తూ వరండాలో ఎదురైన తల్లిని కూడా చూడకుండా సరాసరి తన గదిలో కెళ్ళిపోయింది.

"దాని కోసమని వెళ్ళి నువ్వూ ఇప్పుడొచ్చావు? ఎక్కడున్నావురా? అనిత ఫ్రెండ్స్ అంతా వచ్చి, ఎదురు చూసి వెళ్ళిపోయారు." అంది మహాలక్ష్మమ్మ.

"చూశావుగా అనితను... ఎలా ఉందో! అమ్మా మన అనిత స్నేహితురాలు కవిత పాము కాటుకి చచ్చిపోయింది ..."

"అరె ఎంత పని జరిగింది? నిన్న మనింటి కొచ్చి నాతో ఎంచక్కా మాట్లాడింది రా ఆ అమ్మాయి"! తల్లి విచారించింది.

"అంతేనమ్మా. ఈ రోజు నవ్వుతూ కనిపించిన వారు రేపెక్కడుంటారో? రేపుపై నమ్మకమే లేదు. దాని పుట్టిన రోజు కాస్తా కన్నీటి రోజుగా మారింది. ఇప్పుడే దహనక్రియలు జరిగాయి" అంటూ నిట్టూర్చాడు.

"ఇప్పుడెలా సముదాయించాలో దాన్ని ఏ బాధను వోర్చుకోలేదు" అంటూ లోపలికెళ్తున్న తల్లి వెనకే నడుస్తూ అడిగాడు "నాన్నేరి ?"

"మీ కోసమే చూస్తానంటూ ఇప్పుడే బైటికెళ్ళారు."

"ఎక్కడికెళ్ళారా" ఇంతలోనే వచ్చాడు రామ్మోహన్.

జరిగింది చెప్పింది మహాలక్ష్మి. చెప్పింది వినికూతురుదగ్గరికొచ్చాడు. అనిత దిండులో మొహం దాచుకుని ఏడుస్తుంది.

"అనితా! అరెరె ఏడుస్తున్నావా!" అంటూ తల నిమిరాడు.

"నాన్నా" అంటూ తండ్రి గుండెల్లో మొహం దాచుకుంది ఏడుస్తూనే.

"ఏడవకమ్మా! పోయినవాళ్ళ కోసమే కృశించిపోతే ఈలోకం ఎప్పుడో అంతమైపోయేది. ఈనాడు కవితే గాదు. ఏనాడో వోనాడు అంతా ఈలోకాన్నొదలాల్సినవారమే పదమ్మా. కాస్త ఎంగిలి పడుదువు" అన్నాడు కాని డా. అనిత కదల్లేదు.

"నువ్వు డాక్టరువై ఉండి కూడా ఇలా బాధ పడ్తే ఎలాగమ్మా. నువ్వే అంటావుగా రాత్రిళ్ళు కొంచెమయినా తినాలని. రామ్మా. రా!' గారాబంగా అని దారితీస్తున్న తండ్రిని కళ్ళు తుడుచుకుంటూ అనుసరించిందిఅనిత.

ఆ రాత్రి రమేష్‌కు నిద్రే రాకున్నది. కన్నుమూసినా, తెరచినా కవిత రూపమే! కవితను ఎంతగా ప్రేమించాడు! ఎంతగానో తన హృదయంలో ఆమెకు స్థానమివ్వాలని తనలో సగం కావాలని ఎన్ని కలలుకన్నాడు. ఆ కలలన్నీ కలలుగనే మిగిలిపోయాయి. క్షణ క్షణం మొన్నకవితతో మాట్లాడిన మాటలే గుర్తుకొస్తున్నాయి. పెళ్ళిచేసుకుంటానంటే పెద్దలతో చెప్పండి అంది. ఆ పెద్దలతో చెప్పేనేలోగా కవిత తనకు దూరంగా వెళ్ళిపోయింది. తలచుకుంటుంటె కనులవెంబడి నీరు కంటి కొనలనుండి జారిపోతుంది. అనిత స్నేహం పోయిందని బాధ పడుతుంది. మరొకరితో స్నేహం చేయగలం. కానీ ఎన్నో మధుర భావాలు ఊహించుకుంటూ ఎన్నో తీయని కలలుకంటూ కవితే తనది కావాలనుకున్నాడే !

ఆ స్థానంలో కవిత తప్ప ఇంకెవ్వరూ తనకు తగరు. మరి ఆ కవిత లేదుగా ! ఇలా ఆలోచించు కుంటూ అనిత మంచం వైపు చూశాడు. ఆమె లేకపోయేసరికి ఆశ్చర్యంగా లేచి గోడ గడియారం చూశాడు. పావుతక్కువ పన్నెండు చూపిస్తుంది ముల్లు. అనిత గదిలో లైటు వెలుగుతుంది. ఇప్పుడేం చేస్తుందబ్బా అనుకుంటూ తడిగా ఉన్న కళ్ళు బాగా తుడుచుకుని వెళ్ళాడు. అనిత టేబిల్‌పై తల ఆన్చి నిశ్శబ్దంగా రోదిస్తుంది.

ఆమె చేతిలో కచ్‌వర్క్ చేసిన చేతిగుడ్డ ఉంది. అది కవితే కుట్టినట్టు చూడగానే గుర్తు కొచ్చింది రమేష్‌కి.

"అనితా... ఏమిటమ్మా ఇది! ఇలా అర్ధరాత్రిళ్ళు ఏడిస్తే నీ ఆరోగ్యం ఏం కాను? ఏడవకమ్మా, ఏడవకు." రోదన నిండిన స్వరంతో దగ్గరి కెళ్ళి అన్నాడు.

"...కవితే గుర్తుకొస్తుందన్నయ్యా."

"అన్నీ పోయినా మనకు చివరకు మిగిలేది ఈ జ్ఞాపకాలేనమ్మా! పద పడుకుందువు. కళ్ళు చూడెలా వాచి ఎర్రబడ్డాయో. నాన్న చూస్తే బాధపడ్తారు. రామ్మా! అంటూ అనితను నడిపించుకుంటూ పడుకోబెట్టి తను తన పక్కమీది కెళ్ళిపోయాడు రమేష్

* * *

రమేష్ ఆఫీసుకు వెళ్ళిపోయాడు.



త్వరలో!

ఫోన్లు 62065 72116

సాహితీ వనంలో తులసి మొక్కలా 'జనసుధ' సాహిత్య మాసపత్రిక వస్తోంది!

ఏజంట్లకు మనవి:- మీ ఆర్డర్లకు త్వరంలో తేని ఈ రోజుల్లో

ఓ ప్రముఖ సంస్థ సమర్పిస్తున్న పత్రిక, వివరాలకు సంప్రదించండి!

మేనేజర్: 'జనసుధ' మాసపత్రిక: బ్రాహ్మణవీధి: విజయవాడ-520001



మీ బిడ్డను ఆనందంగా పెరుగనీయండి

ఇన్‌క్రిమిన్* టానిక్ ఇవ్వండి




Lederle ముఖ్యం ఉత్పాదక ® అమెరికన్ సయానమిడ్ కంపెనీ వారి రిజిస్టర్డ్ ట్రేడ్ మార్కు.

Sista's-INC-615/77 TEL.


# పూర్తికాని డైరీ

ఆరోజు తను లీవ్ పెట్టింది. తండ్రి పూజలో ఉన్నాడు. తల్లి పన్లో ఉంది. అనిత ఒక్కత్తే తన గదిలో కూర్చుంది. ఇంతలో కన్నుమూస్తూ కవిత తన డైరీ నిచ్చిన సంగతి గుర్తుకొచ్చి తీసింది. చదవ సాగింది.

'అనితా! డైరీ అంటే తేదీ వేసుకుని వ్రాసుకుంటాం. నేనూ అలాగే వ్రాసుకుంటాను. నా జీవితమే ఓ గాథ అందుకనే ఈ డైరీ ఆధారంగా నా కథ నీతో చెప్పుకుంటున్నట్టుగా వ్రాసుకుంటున్నాను.

అనిత! నువ్వే అన్నావు గుర్తుందా! 'డోంట్ ఫరగెట్ యువర్ ఫ్రండ్ అన్‌టిల్ బ్లడ్ ఈజ్ రెడ్ ఇన్ యువర్ బాడి' నాకు మాత్రం ఎప్పుడూ ఈ మాటే గుర్తుకొస్తుంటుంది. ఏ బాధలున్నా ఆత్మీయులతో చెప్పుకోవాలంటారు. ఇక నా కథ మొదలెడ్తాను. అనిత నిజానికి నా కథ ఎవరైనా వ్రాస్తే వారికి బహుమతి కూడా వచ్చే అవకాశ ముంటుందని నేను అప్పుడప్పుడూ అనుకుంటూంటాను. 'అభాగ్యుల బ్రతుకులు ఇతరులు చిత్రాలు గీసుకోటానికి నవలలు రాసి బహుమతులు పొందటానికి మాత్రమే పనికొస్తాయి' అని ఎక్కడో చదివినట్లు గుర్తు.''

నీకు తెలుసుగా నేను పుట్టింది, పెరిగింది ఇక్కడే! నీ స్నేహం మొదలై ఇంకా ఏడాది కూడా కాకపోయినా మన ఇద్దరిమధ్య ఎంతో ఆత్మబంధం అల్లుకుంది. ఆ బంధాన్నెం తెవరూ తెంపాలనుకున్నా తెంచలేరు.

నేను పుట్టినపుడే బావ నా భర్తని అనుకున్నారట మా పెద్దలు. ఎప్పుడూ వేసవికాలం సెలవుల్లో మా ఇంటికొస్తాడు. నవ్విస్తాడు. ఏవేవో చెప్తాడు. ఆ రోజులు మాకు తెలీకుండానే గడిచిపోయేవి.

నేను యింటర్ ఫైనల్‌లో ఉండగా ఓ సంఘటన జరిగింది లనితా! అప్పుడు నాకు మా క్లాస్‌మేట్ రామకృష్ణతో బాగా పరిచయముంది. అదికాస్తా ప్రణయంగా మారటం వల్లనే బావకు ఉత్తరాలు వ్రాయటం తగ్గించాను. క్లాసులో పాఠం వింటూ అప్పుడప్పుడూ నావైపు చూడ్డం రామకృష్ణకు అలవాటు, ఆ రోజుల్లో నాకో క్లోజ్ ఫ్రెండుండేది. పేరు సునీత. మేం

ఎప్పుడూ పక్క పక్కనే కూర్చునేవాళ్లం."

ఓ రోజు మామూలుగానే రామకృష్ణ చూస్తున్నటు న్నాడు అయినా నేనేమీ గమనించకుండా పాఠం వింటున్నాను. ఇంతలో నెమ్మదిగా అంది సునీత.

"కవిత. రామ క్రిష్ణని తన్నాలే."

"దేనికీ?" ఆశ్చర్యంగానే అడిగాను..

"లేకపోతే ఎప్పుడూ నావైపే చూస్తుంటాడే" అంటుండగనే రామకృష్ణ కొంచెం నవ్వుతూ చూశాడు.

"అదిగో చూడు... ఎలా చూపి నవ్వుతున్నాడో."

"నిన్ను ప్రేమిస్తున్నాడేమోలే" లేనినవ్వు తెచ్చి పెట్టుకుంటూ అన్నాను.

"ఛీ పోవే" అంటూ సిగ్గుపడూ తలొంచుకుంది.

"ఊఁ ఊ ఇది క్లాసు. పాఠం విను" అనేసి పాఠం వింటుండిపోయాను.

ఆరోజు రాత్రి కూడా ఆ విషయమే ఆలోచిస్తుండిపోయాను. మర్నాడు ఈ విషయం రామకృష్ణతో చెప్పాలనుకున్నాను కానెందుకో చెప్పలేకపోయాను. మామూలుగా రోజులు గ~స్తున్నాయి.

చివరిపిరియడు హిందీక్లాస్‌కాగానే నేనూ, సునీత మాట్లాడు కుంటూ ఇంటిదారి పట్టాం. ఇంతలో రా మ కృ ష్ణ మా ముందుగా సైకిల్ మీద వెళ్ళాడు.

"రామకృష్ణకు ఇంగ్లీషులో ఫస్ట్ మార్కనుకుంటాను" అంది సునీత.

"అఁ... ఎంతైనా తెలివి గలవాడు గదా !" అన్నాను.

"మన క్లాసులో నువ్వూ అతను 'తప్ప యింకెవరున్నార్లే" అన్నది.

"మహా అప్పటికి నువ్వు తక్కువైనట్లు" అన్నా నవ్వుతూ.

"అదిసరే అతనితో మాట్లాడే అవకాశమే దొరక కున్నది. ఓ సారి నన్నతనికి పరిచయం చెయ్యవే."

"ఏమ్మా... నువ్వే పరిచయం చేసుకోలేవా ?"

"ఆ బలహీనతే అర్థం కాకున్నది."

"ఇదంతా ఎందుకే నిజంచెప్పు నువ్వతన్ని ప్రేమిస్తున్నావు కదూ !"

"ఊఁ—"

"ఊ లేదు ఆ, లేదు. ఔనూ అని అని చెప్పవే" అంటూ మొట్టాను.

"కాని ఆ విషయం అతని కెలా తెలుపను ?"

"సరే... నే తెలిపి మీ వివాహం జరిపిస్తాను" అన్నాను.

"కవితా ! నిజంగానా" అంటూ నా చేతులు తన చేతుల్లోకి తీసుకుంది. కృతజ్ఞతతో ఆమె కళ్ళు మెరిశాయి.

"నిజం సునీతా ! నీ ఆనందం కన్నా నే కోరేది లేదు. నీ సుఖాన్ని కోరే ఈ స్నేహితురాలుందని ఎప్పటికీ మరువకుండా ఉంటే నా కంతే చాలు."

"అంతటికృతఘ్నురాల్ని ఎప్పటికీ కాలేను కవితా" ఆనందంగా అంది.

అలా మాటల్లో ఇల్లు చేరుకున్నాం. ఇంటికెళ్లగనే బావదగ్గర్నుంచి వచ్చిన ఉత్తరం చూపింది చెల్లాయ్. అప్పటికే దాన్నెవరో చదివేసికూడా ఉన్నారు.

"డియర్ కవితా.

పరీక్షలు చాలా దగ్గర్లో ఉన్నాయి.బాగా చదువు. నా ఎగ్జామ్స్ పూర్తవగానే అమ్మతో వస్తున్నాను" అంటూ వ్రాశాడు. కాఫీ త్రాగి చదువుకుంటూ కూర్చుంటే మనసొప్పనంటుంది.

బావ ఎప్పుడూ మర్చిపోకుండా ఉత్తరాలు వ్రాస్తుంటాడు తను జవాబివ్వటం మరిస్తే అబ్బ ఎంత కోపమో! చెప్పలేం. రామక్రిష్ణని ప్రేమిస్తూ బావను మర్చిపోవాలనుకున్నాను. కానీ 'సునీత కోసం ఇప్పుడు రామక్రిష్ణని మర్చిపోవాలి. సాధ్యమైనదేనా! రెండేళ్ల స్నేహం క్షణంలో ఎలా తెగుతుంది?! భగవాన్! బావ ఎప్పటికీ తనవాడేనని రాసి వుందేమో! అందుకే ఇలా మారిందేమో అనుకున్నాను.

మర్నాడు సాయంత్రం రామకృష్ణను కలిశాను.

"కవితా! మా అమ్మకు కోడలుకావాలని చాలా తొందరగా ఉంది. ఏమంటారో తమరు..." కొంటెగా అన్నాడు.

"చదువు పూర్తి కాకుండానే?..." అన్నాను.

"నేనూ అదే అంటే దానికీ దీనికీ సంబంధ మేముంది అంది. నాన్న అదే అన్నారనుకో... మరీ..." నీ ఉద్దేశం ఏమిటోన్నన్నట్టుగా అడిగాడు.

"రామూ..."

"ఏమిటి ఆగావ్?"

"మరేం లేదు... నా ఫ్రండు సునీత... నెరుగుదువుగా."


"ఎందు కెఱుగను. నాకు మహా మంట. నే నెప్పుడూ నీవైపు చూడబోయినా నా మీదే వుంటాయి ఆవిడ చూపులు" కసిగా అన్నాడు.

"జాగ్రత్తగా మాట్లాడు. అది నా డియరెస్ట్ ఫ్రండు" బెదిరిస్తున్నట్టుగా మాట్టాడాను.

"అయ్యబాబోయ్. ఏం చేస్తావ్ ?" భయపడ్తున్నట్టు నటించాడు. నాకు నవ్వొచ్చింది. నాతోపాటు అతనూ నవ్వేశాడు.

"ఆ అయితే ఇప్పుడేమయిందంటావ్?" అడిగాడు.

"సునీత నా ప్రాణంతో సమానం. దానికోసం ఏమైనా చేయగలను రామూ."



"ఇప్పుడేం చేయబోతున్నావు ఆవిడ కోసం" నవ్వుతూ అడిగాడు.

"రామూ! ముందు ఇది చెప్పు. నాకో కోరికుంది తీరుస్తావా ?"

"నువ్వడగాలేగాని..."

"ప్రామిస్ చెయ్" అంటూ చెయి జాపాను. నవ్వుతూ నా చేతిలో చెయి వేశాడు అతను.

కలకాలం ఇలాగే వీడని బంధంలా ఉండా లనుకున్నాను. ఈ వాగ్దానంతో ఈ బంధం




తెగిపోతుందనుకోగానే కళ్లల్లో నీరు అద్దంలా నిల్చింది.

రామక్రిష్ణకు ఆ కన్నీరు కనిపించ కుండా జాగర్త పడ్డాను.

"నీ కోరికేమిటో తప్పకుండా తీరుస్తాను కవితా. ఇదే నా వాగ్దానం. నీ కోరికలు తీర్చేకన్నా నాకు మరేమీలేదు" అతనా చివరి మాట అంటుంటే ఎంత జాగర్త పడ్డా కన్నీరు జారిపోయింది.

"కన్నీరా...!" ఆశ్చర్యపోయాడు.

"అబ్బే..." అంటూ చప్పున తుడుచు కుని అన్నాను.

"ఊ నేనేం చేయను?"

"నువ్వా...నువ్వా"

"సందేహమెందుకు కవితా...చెప్పు"

"రామూ... నువ్వు సునీతను పెళ్లి చేసుకోవూ!" తొందరగా అనేశాను.

అతనేమీ మాట్లాడలేక నావైపు చూస్తుండిపోయాడు.

"ఇదే నా కోరిక" తలొంచుకుని అన్నాను. అతనివైపు చూడలేక పోయాను.

"క్షమించు కవితా! అదీ నీ తీరని కోరిక కాగలదు" అన్నాడు.

# పూర్తి కాని డైరీ

"చేసిన వాగ్దానం?..."

"హుం వాగ్దానం. వాగ్దానాలు చేసినంత మాత్రాన మనసులు వేరైపోతాయా కవితా?" అతనలా అంటుంటే నేను బల వంతాన దుఃఖాన్ని అదిమిపట్టాను.

"నేనెందుకు సునీతను వివాహమాడాలి! నీ మనసులో కెందుకొచ్చిందా ఆలోచన"? ఆవేశంగా అడిగాడు.

"ఆమె నిన్ను ప్రేమిస్తుంది."

"నేను నిన్ను ప్రేమిస్తున్నా"

"అది జరగని పనంటున్నా"

"అలా అనకు రామూ. నువ్వు క్లాసులో నావైపు చూసినప్పుడల్లా నువ్వు తన్నే చూస్తున్నావని నమ్మి నిన్ను ప్రేమిస్తుందా అమాయకురాలు. రామూ నిన్ను వేడు కుంటున్నా, నా స్నేహితురాలు బాధ పడు తుండగ నేను నీదాన్ని ఎప్పటికీ కాలేను. మర్చిపో" గంభీరంగా నే అన్నాను.

"మీవాళ్లను ఒప్పించైనా నిన్ను చేసు కుంటాను" అంతకన్నా గంభీరంగాఅన్నాడు.

"అక్కర్లేదు. నేనసలు నిన్ను ప్రేమించ లేదు" ఆవేశంగా అన్నాను. ఆ మాటలు ఎందుకన్నానో నాకే తెలీదు.

"కవితా త్యాగానిక్కూడా హద్దుండాలి. నీ సునీతకోసం మరేమయినా చేయి. కానీ కవితా నీ ప్రియుణ్ణికూడా ఆమెకు అంకితం చేయకు. నువ్వు ప్రేమించ లేదన్నంత మాత్రానే నే నమ్ముతాననుకున్నావా! నా మనసును గాయపరచకు కవితా! అప్రసంగం ఇక మర్చిపో ఇంటికెళ్దాం పద."

"వెళ్లాలనిలేదు. ఇంటి దగ్గర సునీత నాకోసం ఎదురు చూస్తుంటుంది. నేనేం చెప్పను..."

"సరే నేను చెప్తాను పద"

"అవసరంలేదు, నువ్వెళ్లొచ్చు."

"ఇక్కడే వుంటావా? చీకటి పడ బోతుంటే"

"నువ్వంగీకరించేవరకు కదలను" మొండిగా అక్కడే కూర్చున్నాను.

"నాకేం భయం. నిన్నెత్తుకుని రిక్షా ఎక్కిస్తాను."

"నే ఇంటికే వెళ్తను. నువ్వెవరవు?" విసుగ్గా అన్నాను.

"ఎవర్నో తమకు తెలీదా?" అంటూ చేయి పట్టుకున్నాడు.

"ఛీ మాట ఇచ్చి కాదనే వాళ్లంటే నాకు మహా అసహ్యం" అంటూ కోపంగా విదిలించుకున్నాను.

"మనసిచ్చి మోసగించే వాళ్లన్నా నాకూ మహా అసహ్యం."

"ఔను నే మోసగత్తెనే. అందుకే నన్ను మరువ మంటున్నాను" కోపంగా అన్నాను.

"అబ్బ కోపంలోకూడా ఎంత అందం!"

"రాము! ఔనో కాదో ఒకే మాట చెప్పెయ్. కాదంటే మాత్రం నీ కంటికి మాత్రం నేను మళ్లీ కనిపించను. ఇదే చివరి చూపౌతుంది."

"అంతే నంటావా కవితా...! అలాగే నీ కోసం అంగీకరిస్తున్నా. నీ కోరిక తీరుస్తున్నా. ఇక మన మధ్య ఏ బంధ ముందని నువ్వు కోరికలు కోర్తావు... నేను తీరుస్తాను, చీకటి పడింది. ఇంటికి పద" బాధగా అన్నాడు.

ఆ కంఠంలో రోదన ఉందని గమనించ గలిగాను. నేనేమీ మాట్లాడలేక పోయాను. మౌనంగా ఇల్లు చేరుకున్నాను. అప్పటి వరకూ సునీత నా కోసం వెయిట్ చేసి వెళ్లిపోయిందట.

* * *

మర్నాటి ఉదయం ఆదివారం. పరీక్షలు దగ్గర్లో ఉన్నాయన్న ధ్యాసతో చదువులో మునిగాను ఎలాగైనా క్లాసు రావాలని, ఎంట్రెన్స్ రెన్యాలని ట్రై చేస్తున్నాను. చిన్నప్పట్నుంచి నాకు డాక్టరు కావాలని ఏంతో కాంక్షగా ఉండేది. ఆ ధ్యాసవల్లే ఇంట్లో ఎవరెంత వద్దన్నా ఈ బై. పి.సి. లో చేరాను. తొమ్మిదింటికే ఆ ప్రాంతాన సునీత మా ఇంటి కొచ్చింది. నాకు తెలుసు తప్పకుండా వస్తుందని.

"హలో క్లవర్‌గారు చదివేస్తున్నారు బాగా!" అంటూ వచ్చి నా ప్రక్కన కూర్చుంది.

"ఏం చదునోలే. బుర్ర కే ఏక్క కున్నది."

"పోదూ నువ్వెప్పుడూ అలాగే అంటావు. అది సరేగాని అతన్నడిగావా ?" అంటూ ఆతృతగా ప్రశ్నించింది.

"ఆఁ చెప్పటం మర్చాను. అతను అడగ్గానే పెళ్లికి సై అన్నాడు. నిజంగానే

అతను నిన్ను ప్రేమిస్తున్నాడట'' లేని హుషారు తెచ్చి పెట్టుకుంటూ అన్నాను. చెప్తుంటే మౌనంగా, ఆ నం దం గా వింటుండి పోయింది.

''వాళ్లమ్మకు కోడలు కావాలని చాలా తొందరగా ఉందట. రేపు మీ ఇంటికి వాళ్ల నాన్నను పంపిస్తానన్నాడు. మన పరీక్షలు ఫినిష్ కాగానే మా సునీతమ్మ పెళ్లికూతురౌతుంది'' నవ్వుతూ అన్నాను.

''కవితా ! నీ ఋణం ఎప్పటికీ తీర్చుకో లేనే.''

''దేనికమ్మా !''

''నీ ప్రోత్సాహం వల్లేగా అతని ఉదేశ మేమిటో తెలిసింది.''

''అబ్బో ఇది కూడా ఒక పెద్ద ఘన కార్యమేనా !''

సిగ్గుపడుతూ తలొంచుకుంది.

''ఇక చాలించవమ్మా సిగ్గు. పరీక్షలింకెంతో దూరంలేవు.'' అంటూ జవాలజీ నోట్స్ సునీత చేతి కిచ్చాను. చాలా సేపటి వరకు ఎవరికి వారుగా మౌనంగా చదువుకున్నాం.

*　　*　　*

పరీక్షలన్నీ తృప్తిగనే వ్రాశాన్నేను. కానీ క్లాసొస్తుందన్న నమ్మకం పోయింది. దేనికంటే వేరే చెప్పనక్కరలేదు.

ఇంతలో పరీక్షలు వ్రాసేసి, మా బావ అత్తయ్యతోపాటు వచ్చేశాడు. అత్తయ్యకు అమ్మవారు వచ్చింది. అమె లేవలేని స్థితిలో మా ఇంట్లోనే వుండిపోయింది.

సునీత పెళ్లి నిశ్చయమైంది. ఆపెళ్ళికి నే నొక్కత్తెనే వెడ్తుంటే బావ కూడా వచ్చాడు నాతో.

పెళ్లి పందింట్లో నావైపోసారి చూసి చూసి ఎందుకో తన్లో తానే నవ్వుకున్నాడు రామకృష్ణ. మాట్లాడే అవకాశం కూడా దొరకలేదు. నా గుండెల్లో అగ్గిలా రగులుతున్న బాధను దిగమింగుకుంటూ సునీతను ఆశీర్వదించాను. అత్తవారింటి కెళ్లబోతూ నన్ను చుట్టేసి భలే ఏడ్చింది సునీత నేనూ ఏడ్చాను. కాని ఎందుకో దానికి తెలియదు...

మా అత్తయ్య వ్యాధిగ్రస్తురాలై బావను నాన్న కప్పగించి కన్ను మూసింది. ఇప్పుడు అతనూ మా ఇంట్లో ఒకసభ్యుడై పోయాడు.

## లియో టాల్‌స్టాయ్ 150 వ జ యం తి

లియో టాల్‌స్టాయ్ 150వ జయంతి ఉత్సవాలను నిర్వహించటానికి సోవియట్ రచయితల యూనియన్ ఒక అఖిల యూనియన్ సన్నాహక కమిటీని నియమించింది. టాల్‌స్టాయి జయంతి సెప్టెంబరు మాసంలో జరుగుతుంది. ఈ కమిటీలో ప్రముఖ ప్రజానాయకులు, రచయితలు, సాంస్కృతిక ప్రతినిధులు, శాస్త్రవేత్తలు, పాత్రికేయులు సభ్యులుగా వున్నారు. సోవియట్ రచయితల యూనియన్ ప్రథమ కార్యదర్శి జార్జి మార్కోవ్ ఋూ కమిటీ అధ్యక్షులుగా వున్నా వుంటారు.

కొంత కాలానికి రిజల్ట్సొచ్చాయి. నాకు సెకండు క్లాసొస్తే నాకే ఆశ్చర్య మనిపించింది. ఇంట్లో అందరికీ సంతోషమే. బావ బి. యస్సీ ఫస్ట్‌క్లాసులో పాసయ్యాడు ఆ రోజు తన తల్లిని జ్ఞాపకం చేసుకుంటూ నా ముందు పసిపిల్లాడులా ఏడ్చాడు.

''ఈ సమయంలో అమ్మే వుంటే ఎంతగా సంతోషించేదో కవితా! కానీ నా దురదృష్టం. నా పరీక్ష రోజుల్లో నాకోసం టీ చేస్తూ, నాతోపాటు చాలా సేపు జాగారం చేసేది...''

''ఎవరికైనా ఏ వయసులోనైనా తల్లి లేని లోటు లోటే బావా! ఎంతైనా తల్లి లేని లోటు మరోటి లేదు. బాధపడకు బావా. అత్తయ్య నీ ముందు లేకున్నా పై నుండి నిన్నెప్పుడూ దీవిస్తూనే ఉంటుంది'' అంటూ సముదాయించాను.

మా నాన్నకు వచ్చే జీతం అంతంత మాత్రంగానే సరిపోయేది మా సరిత అంటే నా తర్వాతది టెన్త్ పాసయింది. దాన్ని యింటర్‌లో చేర్చాలి.

మాఅక్కయ్యకు సంబంధాలుచూస్తున్నా ఒక్కటీ కుదరకున్నాయి. ఆ రోజు సాయంత్రం నాన్న తన గదిలో బావతో మాట్లాడుతున్నారు. నేను వినకూడదనుకుంటూనే అనుకోకుండా ఆ గది కిటికీ కానుకున్నాను. కిటికి తలుపులు మూసే వున్నా సంభాషణ వినిపిస్తూనే ఉంది.

## పూ ర్తి కా ని

''సుజాత కెక్కడా సంబంధాలు కుదరకున్నాయి. కొద్దో గొప్పో అయితే ఇచ్చుకోగలనుగానీ ఇరవై, ముప్పైవేలంటే ఎక్కడ్నుంచి తేను...?'' బాధగా అంటున్న నాన్న గొంతు.

''ఈ రోజులో అలా వున్నాయి మామయ్యా... ఉన్నంత మాత్రాన ఏం చేస్తాం. ఆడపిల్ల పెళ్లి చేయాల్సిందే...'' అంటున్నాడు బావ.

''హరి... సుజాతను నువ్వే చేసుకోరా!''

''మామయ్యా!''

నేనుకూడా ఆ మాటకు ఉలిక్కిపడ్డాను ఇంకా ఆత్రుతగా చెవులప్పగించాను.

''చిన్నప్పుడు నిన్నూ కవితను అనుకున్నాం. కానీ అనుకున్నవన్నీ జరగవు ... మీ అమ్మేమో కవిత తన కోడలు కావాలంది. హా ఒక్కమాట చెప్తాను. కవిత చదువుకున్నది. ఇంకా చదవాలనుకుంటుంది. కానీ సుజాత ఏమీ చదవలేదని నీకు తెలుసుగా. ఇప్పుడు చదువుకున్న వారినే చేసుకుంటున్నారు. అందుకని నన్నరం చేసుకుని అంగీకరిస్తే ఈ మామయ్య నీ కెప్పుడూ ఋణపడి ఉంటాడు బాబూ...'' బాధగా అంటున్న నాన్న గొంతు వింటుంటె నాకే ఏడుపు ఆగలేదు. ఇంతలో నా ముందే చాటుగ కన్నీరు తుడుచుకుంటూ గబ గబ వెళ్లిపోయిందక్కయ్య. బహుశ నాన్న, బావల సంభాషణ విన్నదేమో ! నేనూ అక్కడ్నుంచి వెళ్లిపోయాను.

అక్కయ్యను వివాహ మాడేందుకు బావ ఇష్టపడేట్టు చెయ్యాలి. ఎలాగైనా ఒప్పించాలి. తన జీవితంలో ఇద్దరు వ్యక్తులు తటస్థబడ్డారు. ఇద్దరూ తనను ప్రేమించారు. కానీ తానే వారిని కాదనాల్సి వస్తున్నది. అది తన దురదృష్టం. ఇక ఆలోచించలేక నిట్టూర్చాను.

*　　*　　*

''బావా ఎక్కడి కెళ్తున్నావు'' అద్దం ముందు తల దువ్వుకుంటున్న బావను అడిగాను.

''సినిమా కెళ్తున్నాను. వస్తావా నువ్వు ?''

''క్యాన్సిల్ చేసుకోరాదా !''

''దేనికి ?''

## డైరీ

"పార్కులో కూర్చోని వద్దాం."

"అలాగే పద మరి"

ఇద్దరం పార్కు కెళ్ళాం. చాలా క్షణాలు మౌనంగా గడిచాయి.

"అయిస్ క్రీం కావాలా?" అనడిగాడు.

"వద్దు బావా!... ఉద్యోగ ప్రయత్నాలు ఆరంభించు"

"ఏం ఉద్యోగం వస్తేగానీ పెళ్ళాడవా!" నవ్వుతూ అన్నాడు

"హుం పెళ్ళి?..."

"దేనికంత నిరాశగా మాట్లాడుతున్నావు"

"నిరాశకాక జీవితంలో మిగిలిందేముందిలే నాకు"

"ఏమిటో నువ్వంటున్నది నా కర్థం కావటంలేదు..."

విసుగ్గా మొహం పెట్టాడు బావ

"ఏం లేదులే" అంటూ పొడిగా నవ్వేశాను

"ఒక్కోసారి నిన్నర్థం చేసుకోవటం కష్టమనిపిస్తుంది కవితా??"

(ఇంకా వుంది)

---

## బొప్పాయి హల్వా

కావలసిన వస్తువులు :- బాగా పండిన బొప్పాయి ఒకటి (మధ్యసైజుది), ముప్పాతిక కప్పు పాలకోవా, ఒక కప్పు పాలు ఒక కప్పు పంచదార, ముప్పాతిక కప్పునెయ్యి తగినంత జీడిపప్పు, ఎండు ద్రాక్ష, ఏలకుపొడి కుంకుమపువ్వు.

తయారుచేయు విధము :- బొప్పాయికి పైపొట్టుతీసి కాసేపు అలాగే నీటిలో నాననిచ్చి తీసి, ముక్కలుచేసి గుజ్జుతీయాలి. గుజ్జునొక పాత్రలో తీసుకొని పొయ్యి పై పెట్టి కలుపుతూ నీరు ఇగిరి పొడిగా అయ్యేదాకా ఉడికించి దించాలి. ఒకపాత్రలో నెయ్యిని కాచి, ఏలకుపొడి, ఉడికిన బొప్పాయిముద్ద, పాలుపోసి కలపాలి. పంచదార, కోవావేసి కలిపి పొయ్యిపై పెట్టి చిక్కపడేదాకా ఉడికించి, జీడిపప్పు ఎండు ద్రాక్ష కుంకుమపువ్వు వేసి బాగా కలిపి దించేయాలి.

—శ్రీమతి గార్ల సరస్వతి.

---

# వారఫలం

—మహేష్—

### 10-2-1978 శుక్రవారం మొదలు 16-2-1978 గురువారం వరకు

**మేషం:—** సాహసిక వ్యవహారాల్లో నష్టం రాగలదు. శ్రమ కలుగుతుంది. వారం మధ్యలో ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. ప్రయోజనంగల పరిచయాలు ఏర్పడతాయి. రావలసిన డబ్బు అందుతుంది. స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. బంధువులకు చికాకులు ఏర్పడతాయి.

**వృషభం:—** వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. మిత్రుల సహాయం లభిస్తుంది. వారం మధ్యలో చికాకులు ఏర్పడతాయి. మీ ప్రయత్నాలకు ఆటంకాలు వస్తాయి. వారం ఆఖరులో మీ కార్యక్రమాలు అనుకూలంగా ఉంటాయి. స్త్రీలకు—ఆరోగ్యం బాగుండదు. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

**మిథునం:—** ప్రయోజనంగల పరిచయాలు ఏర్పడతాయి. ప్రయాణాలు ఫలిస్తాయి. ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. విద్యా వైజ్ఞానిక రంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. వారం ఆఖరులో చేజిక్కిన అవకాశాలు కూడా జారిపోవచ్చును. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది. దైవకార్యాలు నెరవేరతాయి.

**కర్కాటకం:—** అనుకూలమైన వార్తలను వింటారు. విద్యా వైజ్ఞానిక రంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. స్థిరాస్థి వ్యవహారాలు బాగుంటాయి. వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులనుకల్సుకొంటారు. మీ ప్రయత్నాలు ఫలించగలవు. స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. శుభ కార్యాల విషయంలో అనుకూలత లభిస్తుంది.

**సింహం:—** మీ ప్రయత్నాలకు ఆటంకాలు వస్తాయి. ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది. వారం మధ్యలో మీ కార్యక్రమాలు బాగుంటాయి. రావలసిన డబ్బు అందుతుంది. అధికారులవలన జరగవలసిన వ్యవహారాలు బాగుంటాయి. స్త్రీలకు— కుటుంబ వ్యవహారాల్లో ప్రయాస కలుగుతుంది. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

**కన్య:—** మీ ఆలోచనలు ఫలిస్తాయి. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. వారం మధ్యలో చికాకులు ఏర్పడతాయి. సాహసిక వ్యవహారాల్లో నష్టం రాగలదు. వారం ఆఖరులో అన్ని వ్యవహారాలు తిరిగి బాగుంటాయి. స్త్రీలకు—ఆరోగ్యం బాగుండదు. బంధుమిత్రులను కల్సుకొంటారు.

**తుల:—** మీ కార్యక్రమాలకు సహకారం వస్తాయి. రాజకీయ వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది. వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు. ఉద్యోగంలో గౌరవం బాగుంటుంది. వారం ఆఖరులో ప్రయోజనంలేని శ్రమకలుగుతుంది. స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. ఆడంబరంకోసంవ్యయం జరుగుతుంది.

**వృశ్చికం:—** సాహసిక వ్యవహారాలు బాగుంటాయి. మిత్రుల సహాయం లభిస్తుంది. అనవసరమైన సందేహాలు కలుగుతాయి. వ్యాపారంలో పోటీవారిపోటీ పెరుగుతుంది. ప్రయోజనంగల సంభాషణలను జరుపగలరు. స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. దైవకార్యాలు నెరవేరతాయి.


**ధనుస్సు:—** ఆర్థిక వ్యవహారాల్లో మొహమాటాలు తగవు ప్రయాణాలు వాయిదా పడతాయి. వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. సాహసిక వ్యవహారాలు బాగుంటాయి. వారం ఆఖరులో మీరు అనుకొనేది ఒకటి జరిగేది మరొకటి కావచ్చును. స్త్రీలకు—పుణ్యకార్యాలు చేస్తారు. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

**మకరం:—** వ్యాపారంలో పోటీవారి పోటీ తగ్గుతుంది. రాజకీయ వ్యవహారాలు బాగుంటాయి. మీ కార్యక్రమాలు హడావుడిగాఉంటాయి. స్థిరాస్థి వ్యవహారాలు బాగుంటాయి. విద్యా వైజ్ఞానిక రంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. సంతోషకరమైన సమాచారం అందగలదు.

**కుంభం:—** భాగస్వాములతో కలిసిచేసే వ్యాపారాలు బాగుంటాయి. రావలసిన డబ్బు అందుతుంది. మిత్రులకు సహాయం చేస్తారు. అనుకూలమైన వార్తలను వింటారు. ముందుముందు బాధ్యతలను కలిగించే వాగ్దానాలు చేయడం తగదు. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. దైవ కార్యాలు నెరవేరతాయి.

**మీనం:—** వృత్తి వ్యాపారాలు బాగుంటాయి. పోటీవారిలో గౌరవం లభిస్తుంది. ప్రయోజనంగల పరిచయాలు ఏర్పడతాయి. ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. మీ కార్యక్రమాలు చురుకుగా సాగుతాయి. స్త్రీలకు-ఆరోగ్యం బాగుంటుంది. సాహిత్య కళా రంగాల్లో మీ కృషి రాణిస్తుంది.

# పూర్తికాని కోరిక




రషీదా బేగం

"...బావా చిన్న పాయంత్రం అక్కయ్య గురించి నాన్న నీతో మాట్లాడుతుండగా విన్నాను. అక్కయ్యపై నీ అభిప్రాయం ఏమిటి?"

"కవితా... నువ్వు ఇలాగే అంటున్నావా ?"

"ఔను బావా! అక్కయ్య పెళ్ళి జరిగితేనేగానీ నాన్న మనసు కుదుట పడదు. నువ్వు చూస్తూనే వున్నావుగా నాన్నెలా బాధ పడుతున్నారో... బావా నా మాటపై నీ కేమాత్రం ప్రీతివున్నా అక్కయ్యను చేసుకో. మా కుటుంబానికెంతో సహాయ పడిన వాడౌతావు" అంది కారుతున్న కన్నీరు తుడుచుకోలేక.

"కవితా... నీ కుటుంబం కోసం నీ జీవితాన్నే త్యాగం చేస్తానంటావా !" అంటూ కన్నీరు తుడిచాడు.

"త్యాగంకాదు బావా! బాధ్యత. మా ఇంటికి మగబిడ్డ లేనందున, మా అక్కయ్య తర్వాత నేనే గనక నాపై కొంత బాధ్యత ఉంది. బావా మా పరిస్థితులన్నీ తెలుసు నీకు...వివరించాల్సినవసరంలేదు. మీ సంభాషణ అక్కయ్య విన్నట్టుంది. అది బాధ

*(గత సంచిక తరువాయి)*

పడుతుంది బావా..."

"నీ తృప్తి కోసం పెళ్ళాడనా..."

"మనస్ఫూర్తిగానే..."

"నా మనసు నీ దగ్గరుందిగా" ఆవేదన నిండిన స్వరంతో అన్నాడు.

"దేనికి బావా మాటలతో చిత్రవధ చేస్తావ్ ? ఒక్కసారి నాన్న పరిస్థితి ఆలోచించు. ఆయన బాధకు అంతులేదు బావా! ఈ మధ్య అనారోగ్యంగా బాధపడుతున్నారు. అక్కయ్య పెళ్ళి జరిగితే కొంచెం కుదుట పడగలరు. అంగీకరించవా !" ఏడుస్తూనే బతిమిలాడు తున్నట్టుడిగాను.

"అలాగే" అని మాత్రం అనగలిగాడు.

"బావా ! ఎంత మంచి వాడవి నువ్వు ...నీ కెప్పుడూ ఋణపడే ఉంటాం బావా!" ఏడుపులోనే నవ్వుతూ అన్నాను.

చీకటి పడింది. దీపాలు వెలిగాయి. బావ కళ్ళలో నిల్చిఉన్న నీరు ఆ దీపాల వెలుగులో స్పష్టంగా కన్పించింది నాకు.

అయినా నేనేం చేయను ? సముదాయించలేను. నేనేగా ఆకన్నీటికి బాధ్యురాల్ని !!

అక్కయ్య పెళ్ళి బావతో జరిగిపోయింది. నాన్న ఆనందానికి హద్దు లేక పోయింది. నాన్న సంతోషం చూస్తూ, నాలో నేనే తృప్తి చెందాను.

ఈ పెళ్ళి హడావుడిలో నా కాలేజీ సంగతి పట్టించుకోలేదు. బి. ఎస్సీ లో చేరబోయేసరికి సీట్లన్నీ నిండిపోయాయి. ఎం.బి.బి.ఎస్. కెళ్ళలేక పోయాను. డాక్టరు కావాలనుకున్న నా కోరిక కోరికగానే మిగిలి పోయింది. ఏ కోరిక తీరిందని ఈ కోరిక తీరేందుకు అనుకున్నాను.

గుంటూరు కాలేజీలో చేరాను.

ఆదివారం యింటికి వెళ్తే బావ ఎప్పటిలా నాతో ఫ్రీగా మాట్లాడ్డం మానేశాడు ముభావంగా ఉంటున్నాడు. అక్కయ్యతో నన్నా బాగుంటున్నాడో లేదోనని నాకు అనుమానం వచ్చినా కాదని సరిపెట్టుకున్నాను.

నా రూమ్ మేట్ సావిత్రితో స్నేహం పెరిగింది. ఇంతలో సునీత దగ్గర్నుండి లెటరొచ్చింది.

"ప్రియమైన కవీ !

నీవక్కడ చదువుతున్నావని సరిత ద్వారా

తెల్సింది నాకు మహా కోపమొచ్చిందిలే లేకపోతే నాకు చెప్పకుండా వెళ్తావా! ఎంత చదువులో ఉన్నా లెటర్సు వ్రాయటం మర్చిపోకు ఎదురు చూస్తుంటాను నీ రిప్లైకై — నీ సునీ."

తన కాపురం గురించి ఒక్క ముక్క కూడా వ్రాయనందుకు నాకేదో వెలితి కనిపించింది. నా కసలు ఉత్తరాలు వ్రాయాలన్నా మహా విసుగు. సరిగా ఎవరికీ జవాబివ్వను. ఇక్కడి కొచ్చిన కొత్తలో సరిత వ్రాసినదానికింకా జవాబివ్వలేదు. నాన్న దగ్గర్నుంచి ఈరోజే వచ్చింది మరో ఉత్తరం. ముందుగా నాన్నకు వ్రాసి సునీతకువ్రాశాను

"ప్రియమైన సునీ :

మీ కాపురం చల్లగా పారే గోదారిలా సాగాలని ప్రార్థిస్తున్నాను. నీ కవితా' అంతకన్నా మరేమీ వ్రాయలేదు.

రోజులకేం హాయిగా ఏ బాధ్యతా, దిగులు లేకుండా చక్కా దాటుకుంటూ పోతున్నాయి. 'ఆ పారె గోదావరిలో తుఫాన్లుంటాయి కవితా!'' అంటూ ఎప్పటికో జవాబు వ్రాసింది ఎందుకలా వ్రాసిందో అర్థం కాలేదు. పరీక్షల దోరణిలో మర్చేపోయాను ఆ విషయం గూర్చి సావిత్రి, నేను పరీక్షలు బాగానే వ్రాశాం క్వార్టర్లీ పిదప ఇంటి కెళ్తే నా బావ నాతో ముభావంగానే ఉన్నాడు. అందుకే హాఫియర్లీ పిదప ఏవో వంకలతో ఇక్కడే గడిపాను ఇక వేసవి కాలం సెలవులుకూడా వచ్చేశాయి. సావిత్రి సెలవు దొరికితే చాలు పక్కా వాళ్ళ ఊరెళ్తుంది. ఇప్పుడు కూడా వెళ్ళేందుకు సిద్ధమౌతూ నన్ను ఆహ్వానించింది.

"మా ఊరికి రావే కవితా! చాలాసార్లు పిలవాలనుకుంటూ సంకోచిస్తున్నాను."

"ఇప్పుడా కుదరదు లేవే. నాన్న రమ్మంటూ వ్రాశారు."

"రెండ్రోజుల కోసమైనా రారాదా!"

"సారీ... ఏమీ అనుకోకే. ఇంటికెళ్ళి చాలా రోజులయింది. వీలు చూసుకుని వచ్చే ప్రయత్నం చేస్తాను. ఎడ్రసివ్వు"అన్నాను.

"తప్పకుండా రావాలి. నేను రోజూ మరి ఎదురు చూస్తుంటాను" అంటూ ఎడ్రసిచ్చి వెళ్ళిపోయింది.

ఆ రోజే నేను ఇంటి కొచ్చేశాను. మొన్ననే బావకు బదిలీ అయితే అక్కా బావ వెళ్ళి పోయారట. ఇంట్లో పరిస్థితులు చాలా కష్టంగా ఉన్నాయి. నాన్నకొచ్చే జీతం మా చదువులకు చాలకున్నది నా పెళ్ళి జరగాలని అమ్మకు తొందరగా ఉంది.

"నా చదువు పూర్తయేవరకూ పెళ్ళి ప్రసక్తి వద్దమ్మా" అనేశాను.

"చదువు వద్దమ్మా ఇక చాలించు. మన పక్కింటి లలిత చూడు నీ యీడుది. అప్పుడే ఓ బిడ్డ తల్లైంది."

"అమ్మా ఎవరి అంతస్తుకు తగ్గట్టు వారుంటారు లలిత ఒక్కగానొక్క కూతురు. ఆమెకు నాకు ఎక్కడ ?...అన్నట్టు సునీత వచ్చిందా ఎప్పుడైనా?"

"లేదమ్మా. అప్పుడెప్పుడో కనిపించి మీ చెల్లి భరతని పలకరించిందట చాలా చిక్కిపోయిందట"

"వాళ్ళింటి కెళ్తానమ్మా" అనేసి సునీత ఇంటికెళ్తే సునీత అత్తారింట్లో ఉందంది ఆమె తల్లి అక్కడికే వెళ్ళాలని బైల దేరాను. ఇప్పటి వరకూ మర్చిపోవాలని ప్రయత్నించిన రామకృష్ణ గుర్తురాగానే నాకు తెలీకుండానే గుండె వేగంగా కొట్టుకుంటుంది కాలేజీకూడా లేదాయె ఇంట్లోనే ఉంటాడేమో! లేకపోతే షికారు వెళ్ళి ఉండొచ్చు ఈ విధంగా ఆలోచించుకుంటూ ఇల్లు చేరాను. బైటవసారాలో ఈజీచైర్‌లో ఉన్న రామకృష్ణను చూస్తూనే గేటు నెట్టుతూ వెనక్కడుగేశాను. గేటు కిర్రుమంది ఎటో చూస్తున్న తను చూశాడు నా వైపు. నేను చూస్తూ మరో అడుగు వెనక్కేసాను. అతనే నవ్వి తలుపు తెరుస్తూ నా కళ్ళలో సూటిగా చూశాడు. నేను తలొంచుకున్నాను.

"కవితా!... బాగున్నావా?" అతనికళ్ళు ఆనందంగా మెరుస్తున్నాయి. నేను మౌనంగా ఉండిపోయాను,

"మరుస్తున్నావా?" అనడిగాడు.

"సునీత ఏం చేస్తుంది?" దేనికీ జవాబు చెప్పకుండా అడిగాను.

"ముందు లోపలికి రా! నీ ఫ్రెండు ఏ పేరంటానికి... వెళ్ళిందో యేమో."

"రేపొస్తాను...వచ్చివెళ్ళానని చెప్పండి"

"కవితా..." బాధగా పిల్చి అన్నాడు. "అనుకోకుండా కనిపించి నా మనసు నానంద పరచావు?" అన్నాడు.

"రా కవితా... స్నేహితునిగా ఆహ్వానిస్తున్నాను" అంటూ లోపలికి దారితీస్తున్న అతన్ని అనుసరిస్తూ హాల్లోకెళ్ళాను.

ఇంతలో సునీత వచ్చింది.

"కవితా!" అంటూ కౌగిలించుకుంది.

"బాగున్నావా సునీ?ఏం! ఇలా చిక్కావు"


"నువ్వా! నేనా! బాగా వ్రాశావా?"

రానని తలూపాను.

"ముందు కూర్చోనిస్తావా?" ఇంత వరకూ మమ్మల్నే తిలకించి అన్నాడు

"మర్చాను. కూర్చోవే. మీ ఫ్రండ్‌తో మాట్లాడుతుండు నే కాఫీ తెస్తాను" వెళ్ళిపోయింది

"ఆగవే. నాకిప్పుడేమీ వద్దు. కాఫీ టిఫిన్లు ఎప్పుడూ తీసుకునేవే. కాని మనం కలుసుకోవటం చాలా అరుదుగా కూర్చో. రామకృష్ణగారూ మీరూ కూర్చోండి" నేనూ కూర్చుంటూ అన్నాను. ఆ పిలుపుకు అతను కొంచెం ఉలిక్కిపడ్డం గమనించాను, ముగ్గురం కూర్చున్నాం.



దీర్ఘ వ్యాధులకు ఉత్తమ సిద్ధ వైద్యం!

హస్త ప్రయోగం, అంగము చిన్నదై అవసర కాలమందు అసంతృప్తి, శుక్లనష్టము, నపుంసకత్వము, హెర్నియా, చర్మవ్యాధులు, పోస్టు ద్వారా కూడా వైద్యం చేయబడును.
వరిబీజము (బుడ్డ), మూత్ర వ్యాధులు ఆపరేషన్ లేకుండ. రండి
డా॥ దేవర, ఫోన్ 551,
మార్వాడి గుడి వద్ద, తెనాలి.
బ్రాంచి: ౨-డి, శివాజీ స్ట్రీట్, మద్రాసు-17.

మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్సా
విరేపనముతో
చికిత్సను పొందండి
- శస్త్రచికిత్స
అవసరములేదు!



ఆంధ్రప్రదేశ్‌లో ఏజన్సీలు ఇవ్వబడుచున్నవి
VIJAYA : MPM

"నీ కెవరైనా ఫ్రెండున్నారా అక్కడ?"

"ఆఁ సావిత్రి అనే అమ్మాయి వుంది" అన్నాను.

"ఆమె స్నేహంలో పడి నన్నుమర్చావా?"

"మరి నెస్తే ఇలా ఎందుకొస్తానే" నవ్వుతూ అన్నాను.

రామకృష్ణ ఎటో చూస్తూ సంభాషణ వింటున్నాడు

"వచ్చిన వారి రాక ఇష్టంలేనట్లు మౌనంగా ఉన్నారు మీ శ్రీవారు."

"అబ్బే అదేమీకాదూ... వారి అలవాటే అంత" ఆ మాటల్లో కొంచెం తడబాటు గమనించాను.

మౌనంగా ఉన్నట్టుండి అక్కడ్నుంచి లేచి వెళ్ళిపోయాడు.

"నా రాక మీ వారికి కష్టం కలిగించిం దనుకుంటాను...'!

"ఛఛ అదేంలేదే! నలుగుర్లో వారెప్పుడూ ఫ్రీగా కూర్చోలేరు."

"మా కెందుకు తడబడుతుంది" సూటిగా అడిగాను.

"తడబాటా... ఎక్కడా?"

"సునీ... మీ కాపురం ఎలా సాగుతుందో నిజంచెప్పవే. లేకపోతే నే చచ్చినంత ఒట్టు" ఒట్టేసుకోవటం మా కలవాటు.

"ఛఛ అదేంమాటరే పిచ్చిపిల్లా!"

"పారే గోదావరిలో తుఫానుంటాయని వ్రాశావు. అప్పుడే నా కనుమానం వచ్చింది. నిజం చెప్పవే." నిలదీశాను.

"నీతో ఏమని చెప్పనే నే కోరిన వారితో నా వివాహం జరిగేట్టు చేశావు. కానీ వారు నన్ను ప్రేమించలేదని స్పష్టంగా చెప్పేశారు. దంపతులమన్న మాటేగానీ నారెవరో నేనెవరోలా ఉంటున్నాం. ఈ విషయం మా అత్తామామలకు తెలియదు. అందరిముందు బాగా ఉంటారు. కానీ ఈరోజెందుకో ఇలా ప్రవర్తించారు. కొత్తవారిముందు బాగానే ఉంటారు." దాని కళ్లతోపాటు నా కళ్ళూ తడిసాయి.

"నీ కాపురం ఇలా వుందా సునీ!" ఏడ్చాను.

"నువ్వు బాధ పడ్తావనే నీ ముందు దాచాలనుకున్నా బైట పడిపోయింది..."

"సునీ నువ్వేం బాధ పడకు. ఆ దేవుని కృపవల్ల తప్పకుండా నీ కాపురం చక్కబడు తుంది. మీరెంతో అన్యోన్యంగా ఉండేరోజు

## పూర్తికాని డైరీ

తప్పకుండా వస్తుంది. వెళ్తానేం?!"

కన్నీరు తుడుచుకుని అన్నాను.

ఇంటి కెళ్ళి ఈ విషయమే ఆలోచిస్తూ కూర్చున్నాను. ఏ కలతలు లేకుండా హాయిగా సునీత కాపురం సాగిపోవాలని నా కోరిక.

మర్నాతడన్ని వంటరిగా కలవాలనుకున్నా.

"భరత ఈ చీటి రామకిష్ణ కిచ్చిరా! చూడు సునీత చూడకుండా ఇవ్వాలి. అది వుంటే ఏం లేదని వచ్చేసెయ్" అని పంపాను.

ఇంటి కెళ్లగనే రామకృష్ణే ఎదురవటం వల్ల అతనికే ఇచ్చేసిందట భరత.

మర్నాడతన్ని కలవటానికి సాయంత్రం అయిదింటికి బైలుదేరి వెళ్లాను. నాకన్నా ముందే వచ్చి ఎదురుచూస్తూ కనిపించాడు.

"నిజంగా నా కిప్పుడు చాలా ఆనందంగా ఉంది కవితా! నీతో ఏకాంతంగా మాట్లా డాలని అవకాశం కొరకే ఎదురు చూస్తు న్నాను..." నవ్వుతూ అన్నాడు.

నేనేమీ మాట్లాడలేదు. గడ్డిలో కూర్చు న్నాను.

అతనూ కూర్చున్నాడు.

"ఇంత అర్జంటుగా పిలిపించావూ..."

"రామూ... ఆడదాన్ని అన్యాయం చేయడం మంచిది కాదు" అన్నాను కోపంగా

"నేనా! ఎవరిని అన్యాయం చేశాను" అన్నాడు.

"కట్టుకున్న ఆడదాన్ని."

"సునీతకు నేనేం లోటు చూపలేదు. ఆమె కోరినవన్నీ ఇంట్లో ఉంటాయి..."

"ఒక మగని అనురాగం తప్ప..."

"ఓహో ఆవిడగారు నివేదించుకున్నారా తనుతో?"

"అది అందరిలాంటిది కాదు. ఎంత బాధైనా అణచుకుంటుంది... రామూ నువ్వు నాకోసం సునీతను చేసుకున్నావంటు న్నావుగా మరి నా కోసం ప్రేమించలేవా? ఆ సునీతనే కవితనుకోలేవా?" బేలగా అడిగాను.

"పిచ్చి కవితా!" బాధగా నవ్వి అన్నాడు. "ఇది డ్రామా కాదు. మొదటి కృష్ణుడు, రెండో కృష్ణుడు అంతా కృష్ణుడ్లేనసుకోవ టానికి. కాలేజీలో నిన్ను చూసిన మొదటి రోజునుంచే ప్రేమించాను. తిరస్కరించ టమే కాక నీ యిష్టమైన వారితో నా

పెళ్లి జరిపించావు. మన కాలేజీలోనేచదివితే నన్ను పలకరించక తప్పదని కదూ నువ్విక్కడ్నుంచి వెళ్లి పోయావు?''

''రామూ...! నిజంగా నే నా విషయమే ఆలోచించలేదు నా కిక్కడ సీటు దొరక లేదు ''

''తృప్తిపరచేందుకు ఎన్నైనా కల్పించి చెప్పొచ్చులే ''

''నువ్వు నమ్మినా నమ్మకపోయినా నా కొచ్చే నష్టమేమిలేదు

ఇంకొక్కసారి నిన్ను నీ సోదరిలా కోరుతున్నాను సునీత కన్యాయం చేయకు నీలో సగం దానికివ్వు మీరు సుఖంగా పిల్లా పాపలతో ఉండాలని నా కోరిక ప్లీజ్ రామూ మనసుమార్చుకోలేవా! నన్నికనుంచి నీ సోదరిగా భావించమంటున్నాను...'' అంటూ ఏడ్చాను.

''కవితా !'' కన్నీరు తుడిచి అన్నాడు.

''రామూ—'' ఆనందంగా అన్నాను

''కానీ ఒక్కటి గుర్తుంచుకో... నువ్వెక్కడున్నా, ఎలాఉన్నా ఈ అన్న ఉన్నాడని, చూడాలని మాత్రం మరువకు కవితా''

''రామూ ...''

''కాదు... అన్నయ్య''

''నాకూ అన్నయ్యలు లేరు. నిన్నేనా పిల్చుకుని నాకూ ఒక అన్న ఉన్నాడనుకుంటాను...''

''ఇక ఇంటికెళు, కవితా !''

''నువ్వూ ఇంటికెళ్ళగానే సునీతను చిరునవ్వుతో పలకరించాలి...''అన్నాను అతనితో నడుస్తూ.

మందహాసం చేస్తూ తన దారిన వెళ్ళిపోయాడు. నేను ఇంటి కొచ్చేశాను. నా మనసెంతో హాయిగా ఉందిప్పుడు. ఇలా ఉండగ సావిత్రి గుర్తుకొచ్చింది. రోజులన్నీ ఇక్కడే గడిచిపోయాయి. అందర్నీ చూసుకున్నాను. అక్కా, బావను తప్ప. చదువుకోవాల్సింది ఉందనిచెప్పి బైలుదేరి సావిత్రి ఊరి కొచ్చాను. అదిచ్చిన విలాసం ప్రకారం ఇల్లు చేరుకున్నాను. తలుపు తట్టగానే ఓ పొడుగాటి యువకుడు వచ్చి తలుపు తీయగా కొంచెం తటపటాయించాను.

''ఎవరండీ ? ఎవరు కావాలి ? రండి'' తలుపులు రెండూ పూర్తిగా తెరుస్తూ అన్నాడు.

''సావిత్రి'' అంటుండగానే అందుకున్నాడు.

''సావిత్రి ఇల్లు ఇదేనండి. మీ రే నా కవితగారూ !''

''ఔనూ ! మీ కెలా తెల్సు ...'' అనుకుంటూనే ఆశ్చర్యంగా అనేశాను.

''మా సావిత్రి మీ గురించి చెప్పనిరోజు లేదులెండి. మీ రొస్తారన్నారట. రోజూ ఎదురు చూస్తుంది. నేను సావిత్రి అన్నను. రండి'' అంటూ అతను దారి తీస్తుంటే అనుసరించింది.

ఇంతలో సావిత్రి కనిపించేసరికి 'హమ్మయ్య' అనుకుని గట్టిగా ఊపిరి వదిలాను

''హలో కవితా! రారా! నీకోసం ఎదరు చూస్తూనే ఉన్నాను. కూర్చో'' అంటూ కుర్చీ చూపించింది.

''సెలవులన్నీ అయిపోబోతుంటే ఇప్పుడొచ్చావు. ఇక విన్నొదిలేది లేదు. ఇద్దరం కలిసే కాలేజికెళ్దాం. అందాకా ఇక్కడే.... అమ్మా'' పిలుస్తుండగనే ఆవిడ వచ్చింది.

''అమ్మా కవితని చెప్తూంటానే ఇదే! కవితా మా అమ్మ'' అంటూ పరిచయం చేసింది.

''నమస్తే నండీ...''

''నీ గురించి మా సావిత్రి చెప్తూనే ఉంటుందమ్మా. సావిత్రీ బాత్ రూం చూపించు'' అని వెళ్లిపోయింది.

సావిత్రి బాత్ రూం చూపి తల్లి దగ్గరి కెళ్లింది.

అక్కడ పంపు దగ్గర వాళ్లన్న మొహం కడుక్కుంటున్నాడు. నేను తడబడుతూ వెనక్కడుగేసి గది బైటే నిల్చాను. అక్కడున్న పూల మొక్కలవంక చూస్తూ నిల్చున్నాను. ''వెళ్లండి'' అన్నాడు లోపలినుంచి వచ్చి. నేను తలొంచుకుని లోపలికెళ్లి వెనక్కి తిరిగి చూశాను. అతను నన్నలాగే చూస్తూ నిలబడి వున్నాడు. నే చూసేసరికి గబగబ వెళ్లిపోయాడు. నేను మొహం కడిగి వచ్చేసరికి భోజనాల ఏర్పాటు కూడా జరిగింది. అక్కడా డైనింగ్ టేబిల్ ముందు ఉన్నాడతను.

''రా భోం చేద్దాం... మా అన్నయ్యేలేరా...'' అంటూ సంశయిస్తున్న నన్ను చెయ్యి పట్టి లాగింది. వాళ్లమ్మ. మాకు వడ్డించింది.


''కవితగారూ!!'' నోట్లో ముద్ద పెట్టుకోబోతూ ఉలికిపడ్డాను. అతనివైపు చూశాను.

''మా సావిత్రి ఏమైనా చదువుతుందా?'' అడుగుతూ నావైపు చూసేసరికి నా చూపులు మరల్చుకున్నాను.

''క్లాసులో ఫస్టు మీ చెల్లెలే.''

''ఏయ్, అంతా వట్టిదన్నయ్యా ! మా క్లాసులో ఏ సబ్జెక్టులో ఎవరైనా కవిత పిదపే అన్నయ్యా.''

(35 వ పేజీ చూడండి)



# పూర్తికాని డైరీ

(17వ పేజీ తరువాయి)

నేను మౌనంగా తింటున్నాను. అనుకోకుండా అతనివైపు చూస్తే అతను నావైపే చూస్తున్నాడు. నాకు మహాభయమేస్తుంది. ఎంత ధైర్యంగా చూస్తాడు! నా జీవితంలో నాకు నేనుగా ఎవర్ని ప్రేమించలేదు. రామకృష్ణ, బావ తనను ప్రేమించారు కానీ కానెప్పుడూ తనకు తానుగా ప్రేమించలేదు. అందుకేనేమో ఆ ఇద్దరూ ఆ విధంగా దూరమైనారు. అందుకనే నా అంత నేనుగా ప్రేమించాలనుకుంటున్నాను.

"కవి తినవే! అలా కూర్చున్నావు" అంది సావిత్రి. అప్పటిగ్గాని నాకు భోజనం చేస్తున్నానని గుర్తుకు రాలేదు. ఈ మధ్య అనుకోకుండా నా మనసు ఆలోచనలో కెళ్తుంది.

భోజనాల పిదప 'ఆఫీసు కెళ్తున్నానమ్మా' అనేసి వెళ్లిపోయాడు సావిత్రి అన్న.

చాలాసేపటి వరకు ఏవేవో మాట్లాడుకున్నాం. వాళ్లమ్మగారు పనంతా చూసుకుని పడుకున్నారు.

"కొంచెంసేపు పడుకోవే..." అంటూ నవారు మంచం పరచి పక్కేసింది. సావిత్రి మాట్లాడుతూనే నిద్రలో జారింది.

మధ్యాహ్నం పడుకోవటం దానికలవాటు గాబోలు! నాకూ చిన్నప్పుడెప్పుడో ఉండేది. ఇప్పుడు లేదు. అందుకే నిద్ర రాక ఆనాటి పేపర్ తిరగేస్తూ కూర్చున్నాను. అలా ఏవేవో ఆలోచిస్తూ కూర్చుండి పోయాను. నాలుగింటి ప్రాంతాన సావిత్రీ వాళ్లమ్మ నిద్ర లేచారు.

"నీళ్లు పెట్టనామ్మా! స్నానం చేద్దువుగాని..."

"ఎందుకులెండి చన్నీళ్లు చాలు..."

"మొహమాటం అక్కర్లేదమ్మా! నాకు నువ్వూ సావిత్రిలో సమానం" అనేసి నీళ్ళు కాగపెట్టింది.

నేను స్నానం చేసేలోగా సావిత్రి లేచింది అది కూడా ముస్తాబైంది.

"సినిమా కెళ్లాలన్నా ఇది పట్నం కాదుగా. అలా పొలాలవైపెళ్దాం పద" కాఫీ, టిఫిన్ తీసుకున్న పిదప బైలుదేరాం.

చల్లని సాయంకాలం వేళ నడుస్తుంటే పిల్లగాలి వీస్తుంది, ఇద్దరం పొలం గట్టున పిచ్చాపాటి మాట్లాడుకుని చీకటిపడే వేళకి ఇల్లు చేరుకున్నాం. అప్పటికి రాధాకృష్ణ ఆఫీసునుండివచ్చి ఉన్నాడు. రాధాకృష్ణంటే సావిత్రి వాళ్లన్న.

ఆ రోజు మాటా మంతీ అయినాక రాత్రి నిద్ర కుపక్రమించారంతా. నేను సావిత్రి పక్కలోనే పడుకున్నా! సావిత్రికి త్వరగా నిద్ర పట్టుంది. నా మనసు ఆలోచిస్తుంది. పొడుగ్గా వున్న రాధాకృష్ణ విగ్రహమే కళ్లముందు కదులుతుంది. ఇన్నాళ్లకు తనకు తానుగా ప్రేమలోకి జారుతుంది. రాధాకృష్ణ భార్యనయే అదృష్టం తనకుందా ఏమో మరి! ఆ విధేలా రాసి ఉన్నాడో! ఏది ఏమైనా తను అతన్ని ప్రేమిస్తుంది. ఎప్పటికో నిద్ర పోయాను.

మా కాలేజీ తెరిచే సమయానికి ఇద్దరం వచ్చేసినా, నాకు మాత్రం ఎందుకో బాధగా వుంది. ఆ ఇంటి కోడలుగా ఉండిపోతే ఎంత హాయిగా ఉండును!

ఇలా వుంటే ఇక చదువు సాగదని ఆలోచించటం మానాను.

రోజులు గడిచిపోతున్నాయి.

ఫైనల్ ఇయర్ ఎగ్జామ్స్ వ్రాశాము. ఆ చివరి రోజు...

"కవీ! నీకో ముఖ్య విషయం చెప్పటం మర్చానే. ఈ నెల 30న మా అన్నయ్య పెళ్లి" నా గుండె ఝల్లు మన్నది.

రాధాకృష్ణ భార్య కావాలని కలలు కన్నాను. నా అంత నేను ప్రేమించానే గానీ నా ప్రేమను అతనికి వెల్లడి చేయలేదు. పాపం అతనికేం తెలుసు ప్రేమిస్తున్న విషయం.

"ఇదుగో వెడ్డింగు కార్డు. పెళ్లికి తప్పకుండా నిన్ను రమ్మన్నాడే మా అన్నయ్య" అందిస్తూ అంది.

"అలాగే" కార్డు అందుకుంటూ అన్నాను.

సామాను సర్దుకుని ఇంటి కొచ్చేశాను మర్నాడు. ఇంటికొచ్చేసరికి అక్కా బావ వచ్చి ఉన్నారు. అక్కయ్య పురుడు పోసుకుందుకు వచ్చిందన్నది అమ్మ.

"ఎలా వ్రాశావు?"

"ఫర్వాలేదు బావా!"

"ఊం తర్వాతేం జేయాలను కుంటున్నావు?"

"జాబ్ చూసుకుంటాను."



"ఇంకా జాబ్ ఏమిటే పెళ్ళి చేసుకోవూ" అంది అక్కయ్య.

"జాబ్ చేయాలనే చదివాను స్తోమత లేక భరత, సరితల చదువాగి పోయింది. ముందు వారి పెళ్ళిళ్ళు చేయాలి."

"అదేమిటే అలా అంటావు నీకు చేయకుండా వాళ్ళకెందుకు చేస్తామే" అంది అమ్మ.

"నాకు పెళ్ళొద్దమ్మా" గతం తల్చుకుంటూ అన్నాను.

"ఒద్దన్నంత మాత్రాన ఊరుకుంటామే"

"లేకపోతే బలవంతాన ఉరితాడేస్తారా" విసుగ్గా అనేసి అక్కడ్నుంచి వెళ్ళిపోయాను.

రాధాకృష్ణ పెళ్లి కెళ్ళాలనుకున్నాను. కానీ ఇంతలో అక్క కాన్పైంది. మగపిల్లవాడు పుట్టాడు. "కంగ్రాట్యులేషన్స్ బావా! అబ్బాయిని కొట్టేశావ్. పెద్ద పార్టీ ఇవ్వాలి" నవ్వుతూ అన్నాను.

"ఇస్తానుగానీ కవితా నువ్వు పెళ్ళెందుకు చేసుకోనంటున్నావూ" సీరియస్‌గా మొగం పెట్టి అడిగాడు

"బావా ఎందుకు మీరంతా ఇలా నిలదీస్తారు కారణమంటూ లేదు బావా. నాకెందుకో వివాహజీవితమంటే అయిష్టంగా ఉంది. ఇంకెప్పుడూ పెళ్ళి గురించి అడక్క..." అనేసి చాటుగా కన్నీరు తుడుచుకున్నాను

"నువ్వెక్కడున్నా, ఎలా వున్నా ఈ అన్న ఉన్నాడని, ఈ అన్నను చూడాలని మాత్రం మర్చిపోకమ్మా" రామకృష్ణ మాటలు జ్ఞప్తికొచ్చాయి. ఆనాటి నుంచి వాళ్ళ దాంపత్య జీవితం బాగానే ఉంది. వాళ్ళకో బాబు కూడా ఉన్నాడు చూసి చాలా రోజు లయిందనుకుంటూ వెళ్ళాను హాల్లో సునీత రామకృష్ణల మధ్య బాబు ఆడుకుంటున్నాడు నా కేంటో ముచ్చటేసింది వారిని చూస్తే.

"ఏమ్మా ఇప్పటికి గుర్తొచ్చామా!" అంది సునీత

"పోన్లే ఇప్పటికైనా గుర్తొచ్చినందుకు సంతోషించాలి" అన్నాడు రామకృష్ణ.

"అది కాదన్నయ్యా... పరీక్షలు"

"ఎలా వ్రాశావు? నేను బాగా నే వ్రాశాను."

"నేను కూడా..."

"దీని తర్వాత ఏం చేస్తావమ్మా ఎక్కడన్నా నీకు మంచి సంబంధం చూడాలనుకుంటున్నాను."

ఆ ప్రసంగం ఇక్కడగూడా వచ్చినందుకు నాకు మహా విసుగనిపించింది

"నేను పెళ్ళి చేసుకోను ఇలాగే వుండాలనుంది"

"అదేం" భార్యా భర్తలిదరూ ఒకేసారడిగారు

"కారణం ఏమీ లేదన్నయ్యా... నాకెందుకో ఇలాగే వుండాలనుంది ఉద్యోగం చేసుకుంటూ."

"ఆడదానికి జీవితంలో మగవాని చెంతేంతో అవసరం కవితా" అంది.

"మీరంతా ఉండగా ఇంకా నాకేం కావాలే."

"ఆ బంధాలు పుట్టింట్లో ఉన్నంతవరకేనమ్మా"

"దయచేసి అన్నయ్యా పెళ్ళి మాట ఎత్తకు. నన్నిలా ప్రశాంతంగా, ఒంటరిగా ఉండనివ్వండి" అంటూ బాబు నెత్తుకుని వాడి చేతుల్లో చాక్‌లెట్స్ పెట్టాను

"నీ ఉద్దేశం మా కెవ్వరికీ నచ్చకున్నది కవితా" అన్నాడు.

"నాకు నచ్చిందన్నయ్యా"

"మనం ఏదైనా చేస్తే అది నలుగురికీ నచ్చేలా ఉండాలమ్మా"

"నలుగురితో నా కనవసరం. ఇది నా స్వంత విషయం."

"కవితా! నా మాట వినవా ?"

"క్షమించన్నయ్యా... నా కెందుకో పెళ్ళంటే బాధగా, భయంగా ఉంది. దాని గురించి తలచుకోవాలన్నా నాకే తెలియని బలహీనత ఏదో నన్ను పీడిస్తుంది ... ఇప్పట్లో పెళ్ళి జరగాలని నా రాతలో రాసి లేదేమో! రాసి ఉంటే ఎలాగూ తప్పదు. ఆ రోజు రాక మానదు. సునీ కాఫీ ఇవ్వా" అన్నాను. వెంటనే అక్కడ్నుంచి వెళ్ళిపోయింది సునీత.

"కవితా నువ్వెందుకిలా ఉన్నావు...గతం నిన్ను బాధిస్తుందా!"

"ఛ ... ఆ విషయాలేనాడో మరచా నన్నయ్యా" ఇంతలో సునీత పిలిస్తే లోపలికెళ్ళాను


ఈ సారి నేను ఫస్టు క్లాసులో పాసైనాను. మార్కుల కోసం కాలేజి కెళ్ళాను.

"సారీ సావిత్రి. వెడ్డింగుకు రాలేకపోయాను. గ్రీటింగ్ అందిందా!" అనడిగాను.

"నువ్వు రాలేదని అన్నయ్యెంత బాధపడ్డాడో. అన్నయ్యకు నేనెంతో నువ్వా అంతే. నీకు ఫస్టుక్లాసొస్తే నాకన్నా ముందు అమ్మా, అన్నయ్యా సంతోషించారు." ఈ మాటలు విని గట్టిగా నిట్టూర్చాను.

"ఇప్పుడైనా రావే!"

"సారీనే... వీలుకాదు. చాలా పనుంది. ఏదైనా జాబ్‌కోసం ప్రయత్నించాలి. ఒదిన గారికి నా నమస్కారమని చెప్పు" అనేసి వచ్చేశాను.



బాధారహిత ప్రకృతిసిద్ధమైన ఆరోగ్యము మీదే!
స్త్రీల బాధలు ప్రత్యేకమైనవి
లోధ్ర
75 సంవత్సరములకు పైగా సుఖజీవనమునకు లోధ్ర టానిక్‌ను వాడిన స్త్రీలు ఎందరో!
ఉచిత వైద్య సలహాకు ఈ క్రింద పేర్కొనబడిన విలాసమునకు ఈ కూపన్‌ను పూర్తిచేసి మీ జాబుతో పంపండి.
పేరు: ____
విలాసము: ____
____ PIN ____


కేసరి కుటీరం (ప్రైవేట్) లిమిటెడ్ రాయపేట, మద్రాసు-14.
ఏజంట్లు: శీతారామ జనరల్ స్టోర్స్ ఏజన్సీస్ విజయవాడ — సికింద్రాబాద్ — బెంగుళూరు

మీ బిడ్డను ఆనందంగా పెరుగనీయండి
ఇన్‌క్రిమిన్* టానిక్ ఇవ్వండి
అధిక ఆహారాన్ని
అధిక పెరుగుదలగా మారుస్తుంది
తింటున్న ఆహారమంతా
వంటికి పట్టేట్టు చేస్తుంది


Lederle యొక్క ఉత్పాదన * అమెరికన్ సయనమిడ్ కంపెనీ వారి రిజిస్టర్డ్ ట్రేడ్ మార్కు.
Sista's INC-915/77 TEL.

## పూర్తికాని డైరీ

ప్రయత్నించగా గరల్స్ హైస్కూల్లో జాబ్ దొరికింది. రోజులు మామూలుగా గడుస్తున్నాయి. నా జీతం ఇంట్లో ఇవ్వకుండా బ్యాంకులో వేసేదాన్ని, ఆ డబ్బు కూడబెట్టి మా సరితకు మంచి సంబంధం చూశాను. నా పెళ్లి కాకుండానే దాని పెళ్లా అంటూ బాధపడ్డారు అమ్మా నాన్న. నాన్నను సముదాయించాను. సరిత పెళ్లి జరిగిపోయింది. ఇక భరత ఉంది. ఎప్పటి డబ్బు అప్పుడు భరతపేర బ్యాంకులో వేస్తున్నాను.

ఓ రోజు వర్షంలో తడుస్తూ స్కూలు నుండి ఇంటి కొచ్చాను. మర్నాడు ఒకటే జ్వరం అయినా అలాగే లెక్కచేయకుండా బడికెళ్తూ వారం రోజులు నెట్టినా అది వదలనంది. ఆసుపత్రి కొచ్చాను. నీతో పరిచయమైంది. మీ ఇంటికొచ్చిన రోజు మీ అన్నయ్యతో పరిచయం కలిగింది. నీలాంటి డాక్టరు నా మిత్రురాలవటం నా అదృష్టంగా భావించుకుంటున్నాను. ఆ రోజు మీ యింటి కొస్తే నీవు ఆసుపత్రి కెళ్లావన్నారు మీ అన్నయ్య.

"కూర్చోండి."

"థ్యాంక్స్."

చాలా క్షణాలు మౌనంగా జరిగాయి.

"మిమ్మల్నొక టడగనాండి."

"ఏమిటండీ?"

"మరేం కాదు... నన్ను వివాహం చేసుకొంటారా ?"

అనుకోకుండా ఎదురైన ఈ ప్రశ్నకు తెల్లబోయాను.

"మానాన్నతో మాట్లాడుకోండి" అనేసి లేచాను వెళ్ళేందుగ్గాను. ఈ సారి నే నెవర్నీ ప్రేమించ కూడదను కున్నాను. కానీ మీ అన్నయ్య మాటలతో నాలో ఏవో ఆశలు కలిగాయి.

"రేపు మా అనిత పుట్టినరోజు"

"అలాగా ... వస్తాను" అనేసి ఇంటి కొచ్చేశాను. ఆ తర్వాత... ఆ తర్వాత ఇక ఆ డైరీలో యిక వ్రాసిలేదు. ఇంతసేపు కవిత తనతో మాట్లాడుతున్నట్టే అనిపించింది. చదువుకుని ఏడుస్తుండగ రమేష్ వచ్చాడు.

"అన్నయ్యా కవిత తన డైరీ చదువు

కొమ్మని ఇచ్చింది. పూర్తికాని డైరీ అది. ఇంకా పేజీలు మిగిలిఉన్నా దాని ఉపయోగం మాత్రం పూర్తి అయింది... ఓ కలంకు ఒక రూపం ఏర్పడకనే కవిత వెళ్ళిపోయిం దన్నయ్యా. నిజంగా దానిది కర్మేటి గాదే. అది జీవితంలో ఏ నాడూ ఏ సుఖానికి నోచుకోలేని దురదృష్టవంతురాలు ...'' అంటూ ఏడుస్తున్న చెల్లెల్ని సముదాయించలేక డైరీ నందుకుని గబ గబ పేజీలు తిరగేశాడు రమేష్ !... కాని చినిగిపోయిన డైరీ శిథిలమైపోయిన జీవితానికి ప్రతిబింబం అది...

---


# ఆనాడూ ఈనాడూ కొందరి చర్మ సౌందర్యం ఒక్కటే!




పియర్స్ - అసలైన గ్లిసరిన్ సబ్బు

పియర్స్ అందించే వాజూకుతనాన్ని మీ చర్మానికి సమకూర్చండి. సబ్బుల తయారీలో ఓ శతాబ్దపు అనుభవం స్ఫటికం వలె గల ఈ ప్రతి ఒక్క సబ్బులోనూ ఇమడ్చబడింది. పియర్స్ యొక్క సౌమ్యత, స్వచ్ఛత ఈ సబ్బు ద్వారా మీరు చూడవచ్చు.

**పియర్స్ మీ చర్మాన్ని యవ్వనంగా, సుకుమారంగా ఉంచుతుంది**

హిందూస్థాన్ లీవర్ వారి ఉత్పత్తి

లింటాస్-PS.57-203 TL